ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు
5
శనివారం 30 నవంబరు 2024

మార్చిలోగా జీపీఎఫ్ చెల్లింపులు

● జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ వెంకటేశ్వర్లు



ముఖాముఖి

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ చెల్లింపులు డిసెంబరు నుంచి మార్చి నెల నెలలోగా జరిగే అవకాశం ఉందని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం వెలువడగానే పెండింగ్ బకాయిలు ఆటోమేటిక్‌గా వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఉద్యోగులకు గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షనర్ల సమస్యలపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు
జవాబు: జిల్లాలో అన్ని ప్రభుత్వశాఖల నుంచి 20 వేల మంది ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారు 18,805 మంది ఉన్నారు.

ప్రశ్న: జీపీఎఫ్ బకాయిల చెల్లింపులు పెండింగ్ ఎందుకు
జవాబు: గత ప్రభుత్వ హయాంలో 2021-22 సంవత్సరానికి సంబంధించి ఉద్యోగుల డీఏలు, అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగులకు చెల్లింపుల కోసం అన్ని వివరాలు సీఎఫ్ఎంఎస్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌లోడు చేశాం. ఇవన్నీ చెల్లింపులు జరగాలంటే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

ప్రశ్న: ఎంతమందికి జీపీఎఫ్ చెల్లించాల్సి ఉంటుంది
జవాబు: జిల్లాలో 2004కు ముందు ఉన్న దాదాపు 4 వేల మందికి వర్తించనుంది. ఆ తరువాత ఉద్యోగాలు వచ్చిన మిగతా ఉద్యోగులంతా సీపీఎస్ పరిధిలోకి వస్తారు. వారందరికీ జీపీఎఫ్ వర్తించదు.

ప్రశ్న: జీతాలు, పెన్షన్ల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా
జవాబు: గత ప్రభుత్వ హయాంలో 1-15 వతేదీ వరకు జీతాలు, పెన్షన్ల చెల్లింపులు జరిగేవి. ఉద్యోగుల్లో పెన్షనర్లలో అసంతృప్తి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెల 1 లేదా 2 వతేదీలోగా చెల్లింపులు జరుగుతున్నాయి.

ప్రశ్న: సకాలంలో సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ కావడం లేదంటున్నారు
జవాబు: అది నిజమే. జీతాలు, పెన్షన్లు, పెండింగ్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, అడ్వాన్స్‌లకు సంబంధించి ప్రతినెలా ప్రభుత్వం విధించిన తేదీల్లో కాకుండా.. నెల చివరన అన్నింటికి సంబంధించి ఒక్కసారిగా తంబ్ వేయాల్సి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జాప్యం జరగకుండా ఇప్పటికే అలాంటి అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నాం. బిల్లులు పెట్టిన 5 రోజుల్లోనే అప్రూవల్ చేస్తున్నాం.

ప్రశ్న: పెన్షనర్లకు కమ్యుటేషన్ రికవరీ ఎన్నాళ్ల వరకు చేస్తున్నారు?
జవాబు: గతంలో 15 ఏళ్ల వరకు కమ్యుటేషన్ రికవరీ ఉండేది. కొందరు పెన్షనర్లు తమకు అన్యాయం జరుగుతోందని కోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు 11 ఏళ్ల 3 నెలల వరకే రికవరీ చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తీర్పును అమలు చేయడంతో 3 ఏళ్ల 9 నెలల కమ్యుటేషన్ రికవరీ నుంచి పెన్షనర్లకు మేలు జరిగింది.

ప్రశ్న: సీఎఫ్ఎంఎస్‌లో సమస్యలు ఉన్నాయా?
జవాబు: ఇంకా కొంతమేర సాంకేతిక సమస్యలు ఉన్నాయి. జిల్లా పరిధిలో ఉండే సమస్యలు నాదృష్టికి వస్తే లాగిన్‌లో సవరించే వెసులుబాటు ఉంది. నా పరిధి దాటితే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సాంకేతిక పరిజ్ఞానం వల్ల సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు ఏ స్టేజీలో ఉన్నాయో డీడీవోలు తెలుసుకోవచ్చు.

జిల్లాకు ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిర్వహించిన బదిలీల్లో జిల్లాకు ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో వెంకటేశును కడప జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించారు. ఎస్.నీలమయ్యను కడప జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిగా, యు.రంగస్వామిని కడప సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్ రిమ్స్) పరిపాలనాధికారిగా నియమించారు.

కడపలో పోలీసులకు క్రీడాపోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



క్రీడాస్ఫూర్తితో ఆడాలి

● ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు
● పోలీసులకు క్రీడాపోటీలు ప్రారంభం

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడాస్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని, గెలుపోటములు ముఖ్యం కాదని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. శుక్రవారం నగరంలోని పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు వార్షిక పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రారంభ సూచకంగా బెలూన్లు, కపోతాలను ఎగురవేశారు. జిల్లాకు చెందిన జాతీయస్థాయి హాకీ క్రీడాకారుడు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎంఎస్ విజయభాస్కర్ అందించిన క్రీడాజ్యోతితో ఇన్‌చార్జి ఎస్పీ క్రీడాజ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో క్రీడాప్రతిభను వెలికితీయడానికి పోలీసు స్పోర్ట్స్ మీట్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయన్నారు. 24గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీసుసిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడంతో పాటు వారిలో ఉన్న క్రీడాప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. మూడురోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్‌మీట్‌లో ఆరు పోలీసు సబ్ డివిజన్లకు సంబంధించిన టీమ్‌లు పాల్గొంటాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, డీపీవో ఏవో జ్యోతి, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, టైటస్, శివరాముడు, నగరంలోని సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా తొలిరోజు రన్నింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



రన్నింగ్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ

నిబంధనలు తూచ్..!

● పెట్రోలు బంకుల్లో నిబంధనలు పాటించని నిర్వాహకులు
● గాలిమిషన్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కరువు
● చోద్యం చూస్తున్న అధికారులు

జిల్లాలోని పెట్రోలు బంకుల నిర్వహణ అధ్వానంగా ఉంది. కొన్ని బంకుల్లో తప్ప చాలా చోట్ల వాహనాల టైర్లకు గాలి నింపే మిషన్లు లేవు. మరుగుదొడ్లు కూడా ఎక్కడా కానరావడంలేదు. పెట్రోలు, డీజలు కొలతలు సరిగ్గా ఉన్నాయా? అంటే అదీ అనుమానమే. ఎంతో మంది వాహనదారులు పెట్రోలు, డీజలు కొలతలపై ఫిర్యాదు చేస్తున్నారు. పెట్రోలు నాణ్యత ప్రమాణాలు పరీక్షించుకోవడానికి ఫిల్టరు పేపర్లు ఇవ్వాలి. ఎక్కడా అవి కనబడడం లేదు. వెరసి జిల్లా వ్యాప్తంగా పలు పెట్రోలు బంకుల్లో నిబంధనలను ఏ మాత్రం పాటించడం లేదు.





నిరుపయోగంగా ఉన్న గాలికొట్టే యంత్రం

పులివెందుల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాహనాలసంఖ్య భారీగా పెరిగింది. దీంతో పెట్రోలు, డీజలు వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారం పెరగడంతో ఆయా కంపెనీలు డీలర్లకు ఆకర్షణీయమైన కమీషన్లు ఇస్తూ బంకుల సంఖ్య పెంచుతున్నాయి. అయితే బంకుల్లో నాణ్యత, సౌకర్యాలు ప్రశ్నార్థకంగా మారాయి. వీటిని తనిఖీ చేయాల్సిన పౌరసరఫరాలశాఖ, తూనికలు కొలతలు, రెవెన్యూ విజిలెన్స్ తదితర శాఖలు బంకుల వైపు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ తనిఖీలకు వెళ్లినా.. బంకులకు ఆ సమాచారాన్ని ముందే చేరవేస్తున్నారని అంటున్నారు. దీంతో వీరు తనిఖీలకు వెళ్లేప్పటికి అక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

210 పెట్రోలు బంకులు

జిల్లాలో హెచ్‌పీ, ఇండియన్, ఐవోసీ, భారత్, ఎస్ఆర్ తదితర కంపెనీలకు సంబంధించిన 210 పెట్రోలు బంకులున్నాయి. వీటి ద్వారా రోజుకు 8 లక్షల లీటర్ల డీజలు, 5లక్షల లీటర్ల పెట్రోలు విక్రయిస్తున్నారు. అయితే ఎక్కువశాతం బంకుల్లో నిబంధనలు పాటించడంలేదు. కొన్ని బంకుల్లో మాత్రమే గాలిమిషన్లు కనబడుతున్నాయి. ఇవి పేరుకే ఉన్నాయి. టైరుకు గాలికొట్టమని అడిగితే ఆపరేటరు లేడని, బయటకు వెళ్లాడని సమాధానం వస్తుంది. గాలిమాత్రం కొట్టడంలేదు. బంకుల్లో అత్యవసర అనారోగ్య సమయాల్లో ప్రథమ చికిత్స కిట్లు సైతం అందుబాటులో ఉంచాలి. పెట్రోలు నాణ్యత నిర్ధారణకు పేపరు ఫిల్టరు టెస్టు చేయాల్సి ఉంది. మరుగుదొడ్లు, వాష్‌రూములను పరిశుభ్రంగా ఉంచాలి. కొన్నిచోట్ల మరుగుదొడ్లు ఉన్నా వాటికి తాళాలు వేసి ఉంటున్నారు. ఇక వాహనాల టైర్లకు ఉచితంగా గాలి కొట్టుకునే సౌకర్యం కల్పించాలి. కానీ పలు బంకుల్లో ఈ సౌకర్యాలేవీ ఉండటం లేదు.

నిబంధనలు ఇలా..

● ప్రతి బంకులో సంస్థ వివరాలతో పాటు యజమాని పేరు ఉండేలా బోర్డు ఏర్పాటు చేసి మొబైల్ నెంబరు రాయాలి.
● ఫిర్యాదుపెట్టె, రిజిస్టరు ఉండాలి. వాహనదారులు అందులో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలి.
● పెట్రోలు, డీజలు నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి, వారి ఫోను నెంబర్లు, వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలి.
● బంకులను తూనికలు కొలతల శాఖ రెవెన్యూ సిబ్బంది సంబంధిత ఆయిల్ కంపెనీ ప్రతినిధి నిత్యం తనిఖీ చేయాలి. పెట్రోలు డీజలు నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి.
● తప్పనిసరిగా వాహనాల టైర్లకు గాలినింపే యంత్రాలు ఏర్పాటు చేయాలి. నిత్యం అవి పని చేసేలా చూడాలి.
● పెట్రోలు బంకుల్లో పదివేల లీటర్ల ఇంధనం విక్రయిస్తే వచ్చిన ఆదాయంతో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.600వెచ్చించాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలి.
● నెలకు రూ.18వేలు మరుగుదొడ్లకు, తాగునీరు ఇతర సౌకర్యాలకు ఖర్చు చేయాలి.
● పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులకు ప్రథమ చికిత్సకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచాలి.

ఇలా ఫిర్యాదు చేయాలి..

పెట్రోలు బంకుల్లో సౌకర్యాలు లేకుంటే సెంట్రలైజ్డ్ గ్రీవెన్స్ అండ్ మోనిటరింగ్ సిస్టం పోర్టల్ అయిన పీజీ పోర్టల్.జీవోవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా పౌరసరఫరాలు, తూనికల కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం..

నిబంధనల మేరకే బంకుల యజమానులు పెట్రోలు, డీజలు విక్రయించాలి. బంకు వద్ద ధరల బోర్డు ఏర్పాటు చేయాలి. పెట్రోలు కల్తీ జరిగినట్లు తనిఖీల్లో గుర్తిస్తే బంకు సీజ్ చేస్తాం. బంకుల వద్ద డ్రైవర్ల కోసం టాయిలెట్ తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే బంకులపై చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు జిల్లాలో సంబంధిత అధికారులతో కలిసి ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్నాం.

- చాముండేశ్వరి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

తనిఖీలు నిర్వహిస్తున్నాం..

పెట్రోలు బంకులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రతి పెట్రోలు బంకులో తూనికలు, కొలతల శాఖచే సరిచూసి ముద్ర వేసిన ఐదు లీటర్ల పరిమాణం గల కొలత పాత్ర ఉంచాలి. ఏదైనా అనుమానాలు ఉంటే దాని ద్వారా పరిమాణాన్ని సరిచూసుకోవచ్చు. ఆ కొలతపాత్ర లేకపోతే ఫిర్యాదు చేయవచ్చు.

- రవీంద్రరెడ్డి, తూనికలు కొలతల శాఖ అసిస్టెంటు కంట్రోలర్



పులివెందుల పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ పెట్రోలు బంకు

పన్నులు తగ్గిస్తామంటే నమ్మవద్దు

● అక్రమాలకు పాల్పడిన.. ఇద్దరు అడ్మిన్‌లు, ఒక ఇన్‌చార్జి ఆర్ఐ సస్పెన్షన్ ● కడప నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలో పన్నులు తగ్గిస్తామని ఎవరైనా సిబ్బంది చెబితే నమ్మవద్దని కమిషనర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. పన్నులు తగ్గిస్తామని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు సచివాలయ అడ్మిన్‌లను సస్పెండ్ చేశామన్నారు. అలాగే ఒక ఇన్‌చార్జి ఆర్ఐని కూడా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రజలు ఉన్న ఆస్తికి తగ్గట్లు పన్నులు చెల్లించి రశీదులు పొందాలన్నారు. ఇటీవల 4వేల ఇళ్లకు పన్నులు పెరిగాయని, ఈ పెంపుదలలో హెచ్చుతగ్గులుంటే సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. మోసం చేయాలని చూస్తే వంద శాతం పెనాల్టీ వేయాల్సి వస్తుందన్నారు. పన్నులు తగ్గిస్తామని సిబ్బంది చెప్పిన మాటలు నమ్మవద్దని కోరారు. మార్చిలోపు పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ రహిత నగరంగా కడపను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ప్రజలందరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకుండా చూసేందుకు సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు. మురుగుకాల్వల్లో ఇంటిలోని వ్యర్థాలు వేస్తే పెనాల్టీ వేస్తామని తెలిపారు. వినకపోయిన వారికి కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించారు. చికెన్, మటన్ వ్యర్థాలు తీసుకెళ్లేందుకు ఒక కాంట్రాక్టరును ఏర్పాటు చేశామన్నారు. చికెన్ మటన్ వ్యర్థాలు ఆ కాంట్రాక్టర్‌కే ఇవ్వాలని.. అలా కాదని బుగ్గవంక, దేవునికడప చెరువు, కేసీ కెనాల్‌లో వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేషను పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని, రోడ్డు అక్రమణలకు పాల్పడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

తెలంగాణ పోలీసులకు ఆరు కార్లు అప్పగింత



వేంపల్లెలో ఉన్న తెలంగాణ కార్లను సంగారెడ్డి పోలీసులకు అప్పగిస్తున్న సీఐ సురేశ్‌రెడ్డి

వేంపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుకు సంబంధించి ఆరు కార్లను అక్కడి పోలీసులకు అప్పగించామని వేంపల్లె సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రాంతం నుంచి ఓనర్లకు తెలియకుండా కార్లను తీసుకొచ్చి వేంపల్లె ప్రాంతంలో తాకట్టు పెట్టినట్లు సమాచారం. దీనిపై 2023లో సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సతీశ్ అనే వ్యక్తి అతని స్నేహితులకు చెందిన కార్లు కనబడడం లేదని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వేంపల్లెలో కార్లు ఉన్నట్లు గుర్తించి న్యాయం చేయాలని సతీశ్ ఇన్‌చార్జి ఎస్పీని కలిసి విన్నవించారు.

ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం ఆరు కార్లను సంగారెడ్డి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారెడ్డి, సిబ్బందికి అప్పగించామని సీఐ తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్‌పై క్రమశిక్షణా చర్యలు

● పూర్వ డీఐజీపై కూడా..

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్‌శాఖ నిబంధనలు పాటించకుండా, విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబుతో పాటు ఇటీవల బదిలీపై వెళ్లిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ శివరామ్‌పై ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా వీరిద్దరికీ భవిష్యత్తులో పెన్షన్‌కు ప్రతిబంధకం ఏర్పడే అవకాశం ఉంది. లేదా భారీ పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

వైసీపీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ 6
● ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో టెండర్లు, పనుల నాణ్యతపై దర్యాప్తు
● నేడో రేపో విచారణ కమిషన్ రాక

మద్యం పాలసీ గాడి తప్పింది : తులసిరెడ్డి

● గంజాయి కట్టడికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు హర్షణీయం

వేంపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం పాలసీ గాడి తప్పిందని.. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్టుషాపులు అన్న విధంగా తయారైందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హోం మినిస్టర్ నియోజకవర్గమైన పాయకరావుపేటలోని పేటసూదిపురం అనే గ్రామంలో గురువారం బెల్టు షాపునకు దండోరా వేసి వేలంపాట నిర్వహించినట్లు, రమణబాబు అనే వ్యక్తి రూ.2.01లక్షలకు దక్కించుకున్నట్లు వార్తలు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేకచోట్ల బెల్టుషాపులు ఉన్నాయన్నారు. రాబోవు రోజుల్లో మద్యం ఏరులై ప్రవహిస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ కట్టడికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. శ్రీశైలంలో నీటిమట్టం 885 అడుగుల నుంచి 869 అడుగులకు పడిపోయిందని, ఇదిలాగే కొనసాగితే వేసవికాలంలో నీటిఎద్దడి ఏర్పడుతుందన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నారు. డిసెంబరు 1వతేదీన ఆదివారం కావడంతో ఒక రోజు ముందే పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పింఛను లబ్ధిదారులు ఎవరైనా అందుబాటులో లేకపోతే డిసెంబరు 2న అందజేయాలంటూ కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల పింఛను అరియర్స్ పొందే సౌకర్యాన్ని, పింఛన్‌దారుడు మరణిస్తే ఆయన భార్యకు మరుసటి నెల నుంచి పింఛను మంజూరు చేస్తామనే విషయాలను లబ్ధిదారులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 2,58,902 మందికి సంబంధించి రూ.110.40 కోట్లు మంజూరైంది. ఈ మొత్తం ఇప్పటికే డీడీవోలు డ్రా చేసి సచివాలయ సిబ్బందికి అందించారు. జిల్లాలో పింఛను పంపిణీకి గ్రామీణ ప్రాంతంలో 3,555 మంది, పట్టణ ప్రాంతాల్లో 1,514మంది సిబ్బందిని నియమించారు. మొదటిరోజే 99 శాతం పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టరు ఆదేశించారు.

ఇదిలా ఉండగా జిల్లాలో 7117 మంది అభయహస్తం పింఛన్లు పొందుతుండగా 1,34,717 మంది వృద్ధాప్య పింఛన్లు, 37,785 మంది వికలత్వపు పింఛన్లు, 48,410 మంది వితంతు పింఛన్లు పొందుతున్నారు. 3,282 మంది డప్పుకళాకారులు, 940 మంది పూర్తి వికలత్వపు పింఛనుదారులు ఉన్నారు. 3,836 మంది ఒంటరి మహిళలు, 9,349 మంది చేనేత కళాకారులు, 484 మంది మత్స్యకారులు, మరో 2,998 మంది వివిధ రకాల పింఛన్ పొందుతున్న వారి జాబితాలో ఉన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి 7



చిన్నతనం నుంచే కళల పట్ల ఆసక్తి కనబరుస్తూ ఏడో తరగతిలోనే తోడబుట్టిన అన్నవద్దే చెక్కభజన నేర్చుకున్నారు. చెక్కభజన చేస్తుండగా కోలాటంపై ఆసక్తి పెంచుకుని సొంతంగా కోలాటం వేయడం నేర్చుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టాక పలు అవార్డులు సాధించారు. విద్యార్థులకు సైన్స్‌ఫేర్‌పై అవగాహన కల్పిస్తూ వారిని తీర్చిదిద్ది జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకునేలా కృషి చేశారు. శాస్త్ర సాంకేతిక ప్రదర్శనలో అద్భుతమైన ప్రదర్శనలతో మన్ననలు పొందారు. పలు ప్రభుత్వ పథకాల ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ రాణించారు. ఆయనలోని కళాకారుడు బయటికి వస్తే మాత్రం చెక్కభజనల సవ్వడితో సెహభాష్ అనిపిస్తారు. ఈతలో చేపతో పోటీ పడే చురుకుదనం ఆయనది. ఏ రంగంలోనైనా తనదైన ముద్ర వేయాల్సిందే. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రశంసలు అందుకుంటున్న కళా తపస్వి కొండారెడ్డి.

కళాతపస్వి.. కొండారెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు ● చెక్కభజనలో అందెవేసిన చేయి ● కోలాటంలో పట్టు సాధించిన వైనం ● ఆటపాటలు, ఈతలో దిట్ట ● ప్రజా చైతన్య వారధి ● అద్భుతమైన ప్రదర్శనలు అన్నింటా ప్రశంసలు

(ప్రొద్దుటూరు అర్బన్, ఆంధ్రజ్యోతి)

స్థానిక రామేశ్వరంలోని మిట్టమడి వీధి వాసి ఎస్‌ఆర్ కొండారెడ్డి చాపాడు మండలం పెద్దచియ్యపాడు వాసులు శివపురెడ్డి రామిరెడ్డి, లక్ష్మమ్మ గార్ల 5వ సంతానం. టెన్త్ వరకు గ్రామంలోనే పూర్తి చేశారు. ఐదో తరగతి నుంచే తండ్రికి పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవారు. నంద్యాల జిల్లా చాగలమర్రిలోని వాసవీ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ చదివారు. స్థానిక ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ పూర్తిచేశారు. బీఎడ్ చదువు కునేందుకు కాలేజీ ఫీజు కోసం రామాపురంలో విద్యార్థులకు చెక్కభజనలో శిక్షణ ఇస్తూ వచ్చిన డబ్బుతో బీఎడ్ పూర్తిచేశారు.

ఉద్యోగ ప్రస్థానం

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆశయంతో ఖాజీపేట మండ లం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కంటిన్జెంట్ నిధుల ద్వారా నెల కు రూ. 360 వేత నంతో ఆరేళ్లు పని చేశారు. 1995లో జరిగిన ఉద్యోగ ని యామకాల్లో మొదటి సారిగా మోడంపల్లె పురపాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ స్థలం కొరత ఉండడంతో పాఠశాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేసేందుకు చాలా కృషి చేశారు. 2007లో పదోన్నతిపై అని బీసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయి సైన్స్ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగిస్తూ వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీ సేందుకు ఈయన ఎంతో తాపత్రయపడ్డారు. 2011 బదిలీల్లో భాగంగా డీబీసీఎస్ పాఠశాలకు వచ్చారు. అదే ఆశయంతో వరుసగా నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను పంపారు. పంపిన ప్రతిసారి ఈయన ఆధ్వర్యంలో ప్రదర్శించిన నమూనాలు రాష్ట్ర స్థాయిలో మన్ననలు పొంది బహుమతులు సాధించడం గమనార్హం. 19వ జాతీ య సైన్స్ కాంగ్రెస్‌లో ఈయన ఆధ్వర్యంలోని బృందం ఏకంగా జాతీయ స్థాయిలో 'ఏ' లెవల్ ప్రదర్శనగా ఎంపికైంది. ఫిబ్రవరి 28న సైన్స్‌డే పురస్కరించుకుని విద్యార్థులు కూడా రూ. 25 వేల పారితోషికాన్ని అందుకున్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి విద్యార్థులు వెళుతున్నారంటే అక్కడ ఎస్‌ఆర్ కొండారెడ్డి కృషి ఉంటుందనేలా తనదైన శైలిలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

అవార్డుల పరంపర

కొండారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలకు 22 అవార్డులు, 50కు పైగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఎన్‌సీ ఎస్‌సీ ద్వారా 12, సైన్స్ ఫెయిర్ ద్వారా 3, ఇన్ స్పైర్ ద్వారా 3, ఏపీ సైన్స్ కాంగ్రెస్ ద్వారా 3, సదరన్ ద్వారా 1 అవార్డులు రావడంతో రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. చెక్కభజన కళా కారుడిగా ఇద్దరు ముఖ్యమంత్రుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 2024 నవంబరు 11న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం రోజున మంత్రులు నారాలోకేష్, సత్యకుమార్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సమక్షంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అందుకున్నారు. ఏ పోటీల్లో అడుగు పెట్టినా బహుమతి వరించాల్సిందే...

చైతన్య కళాకారుడు..

కొండారెడ్డి ఏడో తరగతి చదువుతుండగానే చెక్కభజనలో ప్రావీణ్యులుగా పేరున్న తన అన్నను గురువుగా, అతన్ని స్ఫూర్తిగా తీసుకుని చెక్కభజన చేర్చుకున్నారు. కోలాటంలో ఆసక్తి పెంచుకుని ఆ కళపై కూడా పట్టుసాధించారు. అప్పటి నుంచి ఒక బ్యాచ్ ఏర్పాటు చేసుకుని చెక్కభజనలు, కోలాటం ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. వీరి ప్రదర్శనలకు మంచి గుర్తింపు రావడంతో సమాచార శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగే ప్రభుత్వ పథకాల ప్రచారంలో భాగంగా కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అక్షరరశ్మి, నీరు-మీరు, వనమహోత్సవాలు, జన్మభూమి, ఎయిడ్స్ లాంటి కార్యక్రమాల్లో చైతన్యవంతుల్ని చేసే దిశగా చెక్కభజనలు, పాటలు పాడుతూ పథకాల ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారు. ఇందు కోసం స్వయంగా కొండారెడ్డి పాటలు రచించేవారు. ఈయన ప్రతిభకు మెచ్చి అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 6వ మహనాడులో ప్రథమ శ్రేణి ప్రశంశా పత్రం, జ్ఞాపికను అందజేశారు.

- 1992లో అక్షరరశ్మి కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు.
- 1992లో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.
- 1987లో కడప జిల్లాలో చెక్కభజన ప్రదర్శనకు ప్రశంశలు లభించాయి.
- 1989లో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లాలో జరిగిన చెక్కభజనకు అప్పటి కలెక్టర్ నుంచి బహుమతులు అందుకున్నారు.
- 2011 నుంచి విద్యార్థులకు చెక్కభజన, కోలాటంలో శిక్షణ ఇస్తూ పాఠశాల కార్యక్రమాల్లో విద్యార్థులతో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు.

ఈతలోనూ దిట్ట..

కడప ద్విశతాబ్ధి ఉత్సవాల్లో ఈత పోటీల్లో పాల్గొన్న కొండారెడ్డి రెండు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. బెస్ట్ స్ట్రోక్‌లో ప్రథమ బహుమతిగా స్వర్ణ పతకాన్ని సాధించారు. ఇక ఫ్రీ స్టైల్ విభాగంలో ద్వితీయ బహుమతితో రాణించారు. అటు విద్యార్థుల్ని తీర్చిదిద్దుతూ ఇటు ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగిస్తూ కొండారెడ్డి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకుంటున్న కొండారెడ్డి



చెక్కభజనలో శిష్యబృందంతో కొండారెడ్డి (ఫైల్‌ఫొటో)

గడ్డి మందు పిచికారీతో ఎండిన పెరటి చెట్లు

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



పూర్తిగా ఎండిన నిమ్మ చెట్టు

కాయలు సైతం ఎండిపోయిన మునగ చెట్టు

రైల్వేకోడూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బయనపల్లె వాసి కస్తూరి ఈశ్వరయ్య ఇంటి పెరటి చెట్లకు గడ్డి మందు పిచికారీ చేయడంతో చెట్లు చనిపోయాయి. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే... ఈశ్వరయ్య ఇంటి పెరట్లో పలు రకాల మొక్కలు నాటారు. ఇంటి ఆవరణలో నిమ్మ, మునగ, జామ, కరివేపాకు, చిక్కుడు, తమలపాకు పెంచుకుంటున్నాడు. అయితే మునగ చెట్టుకు గొంగళి పురుగు చీడ పట్టింది. కాగా ఇదే గ్రామస్తుడు గణేష్ ఈశ్వరయ్య ఇంటి ఆవరణలో ఉన్న మునగ చెట్టుకు పట్టిన చీడ ద్వారా తమ పిల్లలకు రోగాలు వస్తున్నాయని నెల 17న ఈశ్వరయ్య కుటుంబ సభ్యులతో గణేశ్ గొడవ పడ్డాడు. అదే రోజు గణేష్ మునగ చెట్టుపై గడ్డి మందును పిచికారీ చేయడంతో మునగ చెట్టు, నిమ్మ చెట్టు చనిపోయాయి. ఫలితంగా రెండు ఇళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తరచూ గొడవలు పడుతుంటారు. గ్రామంలో ఏదైనా గొడవలు వస్తే సాధ్యమైనంత వరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లరు. ఊరి పెద్దలే పరిష్కరిస్తారు. అయితే ఈ వివాదాన్ని వారు సైతం పరిష్కరించలేక పోవడంతో పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు ఇరు వర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వినకపోవడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు.

ఇక్కడ నిధి, నిక్షేపాలు లేవు

- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

- కలెక్టర్ ఆదేశాలతో బోర్డు నాటిన అధికారులు

సుండుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలుగా బృహత్ శిలాయుగం నాటి సమాధులు ఉన్నట్లు ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.



బోర్డు నాటుతున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

దట్టమైన అడవి మధ్యన సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 50 సమాధులు ఉన్నాయి. అవి కేవలం సమాధులు, ఆదిమానవుల జీవనానికి సాక్ష్యాలు మాత్రమే. ఇక్కడ ఎటువటి నిధి నిక్షేపాలు లేవని సుండుపల్లె తహసీల్దార్ దైవాదీనం ప్రకటించారు. ఇక్కడ ఉన్న సమాధులు, బండలతో నిర్మించిన గూళ్లను ఎవరూ కూల్చకూడదని ఆదేశించారు. ఎవరైనా ఆ సమాధులు ఉండే ప్రదేశానికి వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాయవరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అంజనాస్వాతి ప్రకటించారు. అక్కడ నిర్మాణాల్లో బండలపై నాటి అపురూపమైన చిత్రాలున్నాయి. వాటిని కూల్చరాదన్నారు. గుప్త నిధులు లాంటి నిక్షేపాలు ఉన్నాయని, ఎవరైనా వాటిని కూలిస్తే అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ ఎటుంటి నిధులు లేవు. అజ్ఞాత వ్యక్తులకు ప్రవేశం లేదని బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ పవన్‌కల్యాణ్‌నాయక్, వీఆర్‌ఏ శంకరయ్య, రెవెన్యూ, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నం



ములకలచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు సరిహద్దులోని తనకల్లు మండలం బింతలపల్లె రైతు శ్రీనివాసులు(45) పంట సాగు కోసం రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావణం తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించారు. మదనపల్లె ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు సమాచారాన్ని తనకల్లు పోలీసులకు బదిలీ చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు పెద్దివీడు విద్యార్థి



వీరబల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అండర్-14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పెద్దివీడు రెడివారిపల్లె హైస్కూల్ విద్యార్థి రాజేశ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మధుసూదన్‌రాజు తెలిపారు. చిత్తూరు జిల్లా తవణంపల్లి జడ్పీ హైస్కూల్‌లో 22 నుంచి 24 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో జాతీయ పోటీలకు ఎంపికైన బాలుడు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది రాజేశ్‌ను అభినందించారు. పీడీ రవీంద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ

మున్సిపాలిటీలో టెండర్లు , పనుల నాణ్యతపై దర్యాప్తు ● నేడో రేపో విచారణ కమిషన్ రాక ● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదుతో సీఎంఓ ఆదేశాలు

ప్రొద్దుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో జరిగిన కోట్ల రూపాయల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధమైంది. నేడో రేపో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి విచారణ కమిషన్ రానుందని విశ్వసనీయ సమాచారం. మున్సిపాలిటీలో జరిగిన కోట్ల రూపాయల వైసీపీ అక్రమాలపై 2024 జూలై 8న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. 2024 ఆగస్టు 14న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌అండ్‌అర్బన్‌డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన ఎమ్మెల్యే వరద ఫిర్యాదుపై విచారణ చేపట్టమని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. దీంతో డీఎంఏ అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో వేసిన విచారణ కమిషన్ నేడో రేపో ప్రొద్దుటూరుకు రానుంది. వివరాల్లోకెళితే...

వైసీపీడ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు ఎవరూ స్వేచ్ఛగా టెండర్లు వేయడానికి వీలు లేకుండాపోయిందని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా సింగల్ టెంటర్లకు వైసీపీ నేతల వత్తిళ్లకు అధికారులు అనుమతించడం, ఎక్సెస్ రేట్లకు టెండర్లు వేసుకుని మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టారని ఎమ్మెల్యే వరద అభియోగం. అంతేకాకుండా ఒకే పనిని నాలుగుగా విభజించి నిబంధనలు ఉల్లఘిచారనే ఆరోపణలున్నాయి. రెండు కోట్ల రూపాయల పనిని విభజించి రూ.40 లక్షల లోపు పనులుగా మార్చి మున్సిపల్ ఈఈ స్థాయిలోనే ఆమోదం తీసుకుని ఎస్‌ఈ వరకు వెళ్లకుండా పనులు చేపట్టారని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా మున్సిపల్ పార్కు అభివృద్ధి, మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. అంతేకాకుండా ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణ పనులు నాసిరకంగా జరిగాయని ఆరోపణలున్నాయి. గాంధీరోడ్డు రామేశ్వరం రోడ్డు శివాలయం వీధి మైదుకూరు, ఎర్రగుంట్ల రోడ్డుల్లో డివైడర్ల నిర్మాణ పనులపై కూడా విచారించాలని ఎమ్మెల్యే కోరారు. తాత్కాలిక మున్సిపల్ కూరగాయల మార్కెట్ నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వ్యాపారులతో షెడ్ల నిర్మాణానికి అరుగుల ఏర్పాటుకు డబ్బు వసూళ్లు చేసి మున్సిపల్ నిధులతో తాత్కాలిక కూరగాయల మార్కెట్ నిర్మాణం జరిగిందని ఆరోపించారు. వైసీపీ పాలనలో దాదాపు 1000 నుంచి 1200 వర్కులు జరిగాయని 100కోట్లకు పైగా నిధులు ఖర్చుచేశారని ఇందులో వైసీపీ నేతలు టెండర్లలో అక్రమాలకు పాల్పడి పనులు దక్కించుకుని మున్సిపల్ ఆదాయినికి గండి కొట్టారని ఆరోపించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల సర్టిఫికెట్ లేకున్నా కొన్ని పనులకు బిల్లులు చేశారని ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ స్థాయి అధికారి వైసీపీ నేతల అండతో పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని, దాదాపు 200 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఇందులో కోట్ల రూపాయలు టౌన్ ప్లానింగ్ అధికారి సహా వైసీపీ ప్రజాప్రతినిధి పంచుకున్నారని ఆరోపణలున్నాయి. కొన్ని మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, వీటన్నింటిపై కూడా సమగ్ర విచారణ జరిపి అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫైళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది

రెండు రోజుల్లో విచారణ కమిషన్ రానుండడంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఐదేళ్లలో జరిగిన దాదాపు 1000 పనులకు సంబంధిత అన్ని రకాల ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ నాగరాజు, టీపీఓ చంద్రమోహన్ అక్రమ కట్టడాల నిర్మాణాలు, అనుమతులపై ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల్లో అలజడి

వైసీపీ పాలనలో ఆపార్టీ నేతలు చెప్పిన పనులు నిబంధనలకు విరుద్ధంగా చేసి వుండడంతో కొందరు ఇంజనీరింగ్ అధికారుల్లో అలజడి మొద లైంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమాలుచ అవినీతికి పాల్పడ్డట్లు ఆరోపణలున్నా ఏసీపీ అధికారి కడప కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన కమిషనర్లకు సైతం కొంత సమస్యలు తప్పదని భావిస్తున్నారు.

రైతులకు మైక్రో ఇరిగేషన్ ఒక వరం

90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ● జిల్లా వ్యాప్తంగా 30,950 హెక్టార్లు సాగు లక్ష్యం ● జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

రాయచోటిటౌన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు మైక్రో ఇరిగేన్ ఒక వరమని జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. శుక్రవారం వీరబల్లి మండలం ఓదివీడు రైతు సేవా కేంద్రంలో రాయచోటి ఉద్యానవనశాఖ డివిజన్ పరిధిలోని వీరబల్లి, టి. సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బంది శిక్షణలో ఆమె మాట్లాడుతూ డ్రిప్ అవసరమున్న ప్రతి రైతుకు సూక్ష్మ నీటి పరికరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 30,950 హెక్టార్లలో డ్రిప్ పరికరాల ద్వారా పంటల సాగు అమలు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 28,230 హెక్టార్లకు రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు 4,404 హెక్టార్లకు జిల్లా పాలనాధికారి ఆమోదంతో డ్రిప్ పరికరాలు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రామ ఉద్యాన, వ్యవసాయ, సెరికల్చర్ సహాయకులు అందరూ త్వరితగతిన మైక్రో ఇరిగేషన్ కోసం నమోదు చేసుకున్న రైతుల పొలాలను సందర్శించి ప్రాథమిక సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ప్రాథమిక సర్వే, అంతిమ తనిఖీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సంబేపల్లె మండల ఉద్యాన అధికారి వనితాభాయి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్, కృష్ణానాయక్, వినోద్, సాయికిరన్, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా సూక్ష్మనీటి సాగు అదికారి లక్ష్మీప్రసన్న

నేడు రోల్ అబ్జర్వర్ రాక

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 సంబంధించి జిల్లాకు రోల్ అబ్జర్వర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు ఐఏఎస్ 30న జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఓటరు జాబితా పురోగతిపై పరిశీలించి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ ఆఫీసర్లు హాజరు కావాలని, ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుడి అరెస్టు

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకోకుండా యువతి మృతికి కారకుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన అంజలి కడప ఓ ఆస్పత్రిలో పనిచేస్తోంది. అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న భానుప్రసాద్, అంజలి ప్రేమించుకున్నారు. భానుప్రసాద్ పెళ్లికి నిరాకరించడంతో ఈనెల 5న ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పండింది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి బంధువుల ఫిర్యాదు మేరకు భానుప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు.

భద్రతకే ప్రథమ ప్రాధాన్యం : డీఆర్‌ఎం

● రైల్వే రన్నింగ్ రూం, క్రూ రూం ప్రారంభం

ఎర్రగుంట్ల, నవంబరు 29: రైల్వేలో భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజినల్ రైల్వే మేనేజర్ ఎం.విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంట్లలో ఆయన రైల్వే ఇంజన్ డ్రైవర్స్ విశ్రాంతి (రన్నింగ్) భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ సెమినార్‌ను ప్రారంభించి ప్రసంగించారు. ఉద్యోగులు మానసిక వత్తిడిని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. ముఖ్యంగా విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. క్షణాల్లో జరిగే ప్రమాదాల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు చాలా సంయమనాన్ని పాటించాలన్నారు. కొందరు కడప, కొండాపురం, గుత్తి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారని ఇది సరికాదన్నారు. లోకో డ్రైవర్లు, గార్డ్స్, ఇతర సిబ్బందికి భద్ర తపై ఆయన అనేక సూచనలిచ్చారు. ఇటీవల ప్రమాదాలు పెరిగిన మాట వాస్తమేనని, ఇకపై జీరో ప్రమాదాలు ఉండేలా ప్రతి ఉద్యోగి కృషిచేయాలని సీనియర్ డీఈఈ టీఆర్‌ఎస్‌ఓ వీరయ్య ఉద్యోగులకు సూచించారు. కాగా.. ఎర్రగుంట్లలో రైల్వే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ముఖ్యంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని టెండర్ పిలిచినా ఇప్పటికీ ప్రారంభించలేదని డీఆర్‌ఎం దృష్టికి తీసుకురాగా డిజైన్ పూర్తయిందని పదిరోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ విస్తరణ పనులు అతిత్వరలో జరుగుతాయని అప్పుడు లిఫ్ట్, ఎక్స్‌లేటర్ కూడా వస్తాయని సీనియర్ డీఈఈ టీఆర్‌డీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.



ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రన్నింగ్ రూంను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం విజయకుమార్

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 29: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను ఆయన ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)హాలులో రెవెన్యూ సంబంధిత అంశాలపై కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, రెవెన్యూ అధికారులతో మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా రీసర్వే, వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్, ఆధార్ కరెక్షన్స్, మ్యుటేషన్లకు సంబంధించి ప్రజలు వస్తుంటారని, తహసీల్దార్లు వీఆర్‌ఓలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యను పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, ఏడీ సర్వే భరత్‌కుమార్, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీ ల్దార్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్ల చేలల్లో... రతనాల పైర్లు

ఆ రెండు గ్రామాల రైతులకు రాళ్లు చేలు వరంలా మారాయి. మండలం నుంచి 13 కి.మీ దూరంలో చెన్నుపల్లె, గోపవరం గ్రామాలు ఉన్నాయి. ఇక్కడకు సమీ పంలో పులివాగు.. ఆ పక్కన రాచ్చెరువు.. సింగరాయకొండ ఉన్నాయి. ఈ ప్రాంతంలో చిన్నపాటి రాళ్లతో కూడిన పొలం ఉంది. ఈ పొలంలో ఆ రెండు గ్రామాల రైతులు ఏ పంట సాగు చేసినా మంచి దిగుబడులు వస్తూ.. సిరులు కురిపిస్తున్నాయి.


చెన్నుపల్లె పంచాయతీలో ఉన్న రాళ్లభూమి

- చెన్నుపల్లె, గోపవరం గ్రామాల రైతులకు వరంలా.. రాళ్ల పొలాలు
- ఏ పంట సాగు చేసినా... సిరులు కురిపిస్తున్నవైనం

కలసపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలోని చెన్నుపల్లె, గోపవరం గ్రామాలకు సంబంధించి పులివాగు.. సింగరాయకొండ ప్రాంతంలో 250 ఎకరాల రాళ్ల పొలం ఉంది. మరో పక్క రాచ్చెరువు ప్రాంతం ఉండటంతో రైతులంతా ఆ రాళ్లలోనే పైర్లు సాగు చేయడం మొదలు పెట్టారు. ఖరీఫ్ సీజన్‌లో సజ్జ, మినుము, కంది పైర్లు సాగు చేస్తారు. ఒక్కసారి వర్షం పడితే చాలు.. వెంటనే ట్రాక్టర్లతో విత్తనాలు చల్లి బండరాళ్లను కలియదిప్పుతారు. రాళ్ల కింద పడిన విత్తనం ఆ తర్వాత వర్షం లేకపోయినా బెట్ట తట్టుకుని ఏపుగా పెరిగి అత్యధిక దిగుబడి వస్తుంది. ఇటీవల కొందరు రైతులు కూరగాయల పంటలు సాగు చేసి మంచదిగుబడులు సాధిస్తున్నారు. మిరప, టమోటా పైర్లకు కొద్దిపాటి నీటిని అందిస్తూ వేసవిలో కూడా పైర్లు పండిస్తున్నారు.


రాళ్ల భూమిలో సాగైన సజ్జపంట

సాగు ఖర్చులు తక్కువే..



రాళ్లపైరులో సాగు ఖర్చులు తక్కువగానే ఉంటాయి. వర్షాలు పడినప్పుడు విత్తనాలు వేస్తే కలుపు మొక్కలు రావు. దీంతో కలుపు తీయడం కానీ, నివారణ మందు పిచికారి చేయడం కానీ చేయాల్సిన పని ఉండదు. దీంతో సాగు ఖర్చులు ఎకరాకు 5 నుంచి 10వేల రూపాయలు తగ్గుతున్నాయి.

- ప్రసాద్, రైతు, చెన్నుపల్లె

రాళ్లను తీసివేస్తే దిగుబడి సున్నా

గతంలో కొందరు రైతులు రాళ్లను తొలగించి పైర్లను సాగు చేసేందుకు ప్రయత్నించారు. అయితే వారు విత్తనం వేసినా అది మొలక దశ నుంచి ఏ మాత్రం ఎదుగుదల లేక పైరు దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయామని తెలుసుకున్న రైతులు తిరిగి తొలగించిన చిన్నపాటి బండరాళ్లను మళ్లీ పొలాల్లో తోలారు.

వాతావరణ పరిస్థితే కారణం

రాళ్ల కింద పడిన విత్తనం కింద ఏ మాత్రం తడి ఆరకండా చేస్తుంది. అంతేకాక ఎంత వర్షం పడినా మొక్కకు ఎక్కువ నీరు అందదు. అంతేకాకుండా బెట్ట పరిస్థితుల్లో రాత్రిపూట రాళ్లు చల్లగా మారి మొక్కకు తేమనందిస్తాయి. దీంతో ఏ పంట సాగు చేసినా మంచి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

అధిక దిగుబడులు వస్తున్నాయి



రాళ్లపొలాల్లో అధిక దిగుబడులు వస్తున్నాయి. ఎటువంటి నీటి పారుదల లేకున్నా కేవలం మంచుతోనే మంచి పంటలు పండుతున్నాయి. ఎటువంటి పై పాటి ఎరువులు వేయడం లేదు. దీంతో ఖర్చు తగ్గడమే కాకుండా మంచి లాభాలు కూడా వస్తున్నాయి.

-నాగేష్, గోపవరంపల్లె

బ్లాక్‌మెయిల్ చేసి వివాహమాడి..

- విడిపోయేందుకు డబ్బులు డిమాండ్
- ఇవ్వకపోతే కేసు పెడతామంటూ బెదిరింపులు
- న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


బాధితుడు మస్తాన్‌వలి

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప రవీంద్రనగర్‌కు చెందిన షేక్ ఉమ్మే సల్మా అనే మహిళ తనను బ్లాక్‌మెయిల్ చేసి వివాహం చేసుకుని.. లక్షల్లో డబ్బులను దండుకోవడమే కాక, అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే కేసు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరిస్తోందని బాధితుడు షేక్ మస్తాన్‌వలి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మస్తాన్‌వలి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కడప నగరంలోని ఓ ట్రావెల్స్ డ్రైవరుగా తాను పనిచేస్తున్నానన్నారు. ఆ సమయంలో ఉమ్మే సల్మా తనకు పరిచయమైందని.. గతంలో వివాహమైందని, భర్తను వదిలేశానని మాయమాటలు చెప్పిందన్నారు. తరువాత కొన్ని రోజులకు సల్మాతో పాటు ఆమె చెల్లెలు, చెల్లెలు భర్తతో కలిసి బెదిరించి తనతో వివాహం చేశారన్నారు. ఆ తర్వాత తన నుంచి విడిపోయేందుకు అగ్రిమెంటు రాయించుకుని విడతల వారీగా రూ.లక్షల్లో డబ్బులను దండుకున్నారన్నారు. ఆమె గురించి తరువాత విచారించగా.. తనకు పరిచయం కాకముందు షేక్ అజ్మతుల్లాతో వివాహమై విడిపోయిందన్నారు. తరువాత షేక్ కరీముల్లా, గౌస్, ఆటోడ్రైవరు శివలను వివాహం చేసుకుని వారిని బ్లాక్‌మెయిల్ చేసి అందినకాడికి డబ్బులను దండుకుందని ఆరోపించారు. ఆమె చెల్లెలు భర్త సాదిక్ ఇటీవల కడప తాలుకా పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, తాను డబ్బులు ఇవ్వకపోతే అతని చేత హత్య చేయిస్తామంటూ బెదిరిస్తున్నారన్నారు. ఉమ్మే సల్మా, ఆమె బంధువుల నుంచి ప్రాణహాని ఉందని.. తనకు రక్షించి న్యాయం చేయాలని మస్తాన్‌వలి వేడుకున్నారు.

ఉద్వేగాల నియంత్రణతో ఆరోగ్యకర జీవితం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నవైస్‌చాన్సలర్ తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన జీవితం ఉద్వేగాల నియంత్రణ ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని విజయవాడ ఇన్‌లాస్ హాస్పిటల్ డైరెక్టరు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. వైవీయూ, ప్రధానమంత్రి ఉచ్చతార్ శిక్షణ అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉన్నత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల పని, జీవిత నిలకడ, మానసిక సమ స్యలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సానుకూల ఆలోచనలతో వత్తిడి దూరం చేయవచ్చన్నారు. సంతోషాన్నిచ్చే విషయాలను గుర్తించుకుని.. దుఃఖం విషయాలు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం అధ్యాపకులు అడిగిన మానసిక సమస్యలపై సందేహాలను నివృత్తి చేశారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వైవీయూ అధ్యాపకులకు ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని సమన్వయం చేసిన చంద్రశేఖర్‌ను అభినందించారు. రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి ప్రణాళికబద్ధమైన జీవితం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెమిస్టరు పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావులు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 54 కేంద్రాల్లో 1,3,5 సెమిస్టర్లకు సంబంధించి 20819 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. హైపవర్ కమిటీ అబ్జర్వర్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

2న ఉమ్మడి జిల్లా జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డిసెంబరు 2వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల, బాలికల కబడ్డీ ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జేవీ సుబ్బన్న తెలిపారు. 20 సంవత్సరాలలోపు గల ఔత్సాహిక, అర్హత గల బాల బాలికలు ఎంపికలకు హాజరు కావాలన్నారు. బాలురు 70 కేజీలలోపు, బాలికలు 65 కేజీలలోపు బరువు వుండాలన్నారు. ఇతర వివరాలకు 9133480661 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కోసం ముగ్గుల పోటీలు

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సూచనల మేరకు 30వ తేదీ శనివారం మధ్యాహ్నం 3గంటలకు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ నగిలి రవిబాబు తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో విజేతలైన ముగ్గురు మహిళలకు ప్రైజ్‌మనీ కింద మొదటి బహుమతి రూ.1,111లు, రెండో బహుమతి రూ.777లు, మూడో బహుమతి రూ.555లు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో మహిళలు ముగ్గు పొడి, రంగులు తెచ్చుకోవాలని, పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు అందజేస్తామని రవిబాబు ప్రకటనలో పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష విరాళం

చక్రాయపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాతలు ఆన్‌లైన్ ద్వారా లక్ష రూపాయలు విరాళం పంపించినట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. చెన్నైకి చెందిన సముద్రాల భానుప్రసాద్, ధర్మపత్ని వందన, కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా పంపించారన్నారు. వీరికి స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నదాన విరాళ రసీదు పంపడం జరుగుతుందన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ...కేసు



ఘర్షణలో గాయపడిన వీరనారాయణరెడ్డి, రవిశంకర్

కమలాపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారావుపల్లెలో గురువారం రాత్రి ఇరువర్గాల వారు ఘర్షణలకు పాల్పడగా పలువురికి గాయాలైనట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... అప్పారావుపల్లెలో ఒక వర్గా నికి చెందిన రవిశంకర్, వెంకటసుబ్బయ్య, ఎల్లారెడ్డిలు మరో వర్గంలోని వీరనారాయణరెడ్డి తదితరులు పాతకక్షల కారణంగా ఘర్షణ పడ్డారు. దీంతో రవిశంకర్‌తో పాటు మరో వర్గంలోని వీరనారాయణరెడ్డికి రక్తగాయాలయ్యాయి. వీరిని కమలాపురం సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించామన్నారు. ఇరువర్గాలకు చెందిన ఆరు గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక బేల్దారి ఆత్మహత్య



ప్రొద్దుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన అంకగాళ్ల నాగేంద్ర(24) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అనారోగ్యంతో పాటు అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులకు చేరవేయాలి


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి

పులివెందుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులకు చేరవేయాలని ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మినీసెక్రటేరియట్‌లోని ఉద్యానశాఖ కార్యాలయంలో పులివెందుల వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఐదు ఎకరాల లోపు కలిగిన రైతులకు 90శాతం రాయితీతో రూ.2.18 లక్షల వరకు, 5 నుంచి 10 ఎకరాల్లోపు గల రైతులకు 70శాతం రాయితీతో రూ.3.46 లక్షల వరకు డ్రిప్ పరికరాలను అందజేస్తారన్నారు. 55శాతం మరియు 45శాతం సబ్సిడీలతో స్ప్రింక్లర్‌లు మంజూరు చేస్తామని.. ఈ విషయాన్ని రైతులకు చేరవేయాలన్నారు. ఏడీఏ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రబీలో పంటలు సాగుచేసిన రైతులందరు క్రాప్ బుకింగ్ చేసుకోవాలని తెలియజేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల వారీగా నిర్దేశించిన డ్రిప్, తుంపర సేద్యాల లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. లింగాల ఏఓ రమేష్, పులివెందుల ఏఓ నాగలక్ష్మి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం విజయవంతం చేయండి

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


బలిజల ఆత్మీయ సమావేశం గురించి వివరిస్తున్న హరిప్రసాద్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మేడా కన్వెన్షన్‌లో డిసెంబరు 22న నిర్వహిస్తున్న బలి జ, కాపు, తెలగ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం హరితటవర్స్‌లో బలిజ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 23శాతం మంది బలిజలు ఉన్నా.. బలిజలకు తగిన ప్రాధాన్యత లేదన్నారు. ఈనేపథ్యంలో కూటమి పార్టీలో గెలిచిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లకు సన్మానం, ఆత్మీయ సమావేశ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఎవరి స్వార్థం కోసం నిర్వహించడంలేదని, కేవలం బలిజల సమస్యల పరిష్కారానికి, హామీలు పొం దడానికి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని బలిజ సంఘాలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బలిజ నాయకులు బండిబాబు, మునెయ్య, రావు, చలపతి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు ఫైర్ ఎన్‌ఓసీ తప్పని సరి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ ఆసు పత్రుల యాజమాన్యాలు ప్రమాదాల నివారణకు అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ కలిగి ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల వలన రోగుల ప్రాణాలు అపాయంలో పడకుండా 2022లో గెజిట్ జారీ చేయడం జరి గిందన్నారు. ఎక్కువ పడకలు కలిగిన ఆసుపత్రుల యాజమాన్యాలు గతంలో జారీ చేసిన ఎన్‌వోసీలను రెన్యువల్ చేసుకోవాలని, కొత్తగా అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీని తప్పనిసరిగా పొందాలన్నారు. ఎన్‌వోసీ లేని వారు ఆసుపత్రులను నిర్వహించరాదని, లేకుంటే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు

దోమల నివారణ అందరి బాధ్యత

దోమల కుట్టడం వలన మలేరియా, డెంగీ, గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణ అందరి బాధ్యతగా భావించాలని కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ అన్నారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నగరంలోని చిన్నచౌకు, అన్నారెడ్డి వీధుల్లో జరిగింది. దోమల వలన వ్యాపించే విషజ్వరాలపై, నియంత్రకు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్యాధికారులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలన్నారు. కాలనీల్లో ముళ్ల పొదలు లేకుండా చేసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా ఇళ్లలోని పాత్రలన్నిటిని శుభ్రంగా ఉంచకోవాలన్నారు. పరిసరాల్లో ముళ్ల పొద ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మి రెడ్డి, ఎంపీఈహెచ్ఈవో నిత్య పూజయ్య, ఏఎన్ఎ సరస్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బెల్టుషాపులు, సారా విక్రయాలపై కేసులు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు


గుర్రంగుంపు తాండాలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులు, నాటుసారా విక్రయాలు, తయారీ చేస్తున్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షిస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ హెచ్చరించారు. చింతకొమ్మదిన్నె మండలం గుర్రంగుంపు తాండలో శుక్రవారం గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. గతంలో చుట్టుపక్కల నాటుసారా తయారు చేసేవారని, ఇప్పుడు కూడా అలా కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించకూడదని, ఎవరైనా నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి, సారా లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంటు కమిషనరు చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటరు రీడర్ల సమస్యను పరిష్కరించండి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ మీటరు రీడర్ల సమస్యను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ విద్యుత్ మీటరు రీడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటరు రీడర్లు సంస్థను నమ్ముకుని గత 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారన్నారు. వారు పలు సమస్యలతో ఇబ్బం దిపడుతున్నారన్నారు. ఇందులో వేతన చెల్లింపు సమస్య ఒకటన్నారు. వారికి ఎస్క్రో అకౌంటు ద్వారా జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సెప్టెంబరు 2024 నుంచి ఎస్క్రో అకౌంటు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. ఈ విధా నాన్ని ప్రతి జిల్లాలో తక్షణం అమలు చేయాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాల ద్వారా తెలిపామని, అయినప్పటికీ ఏ మాత్రం చలనం లేదన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షుడు వేణు గోపాల్, బాదుల్లా, మద్దిలేటి కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారుల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సికెదిన్నె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి కోరారు. శుక్రవారం చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లిలో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల మహానంది అగ్రికల్చరల్ 4వ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన రైతు సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృషివిజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం తదితర సంస్థల సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఖర్చులు తగ్గించుకుని ఉత్పత్తులు పెంచుకునేందుకు తగిన సలహాలు, సూచనలు పొందాలన్నారు. కేవీకే సమన్వయకర్త వీరయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యక్షంగా రైతులతో పొలంలో పాల్గొని విజ్ఞానాన్ని పొంది రైతులకు మంచి సలహాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గీత, శిరీష, మానస, మహేష్‌బాబు, భాగ్యలక్ష్మి, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులు తయారు చేసిన మోడల్స్ రైతులను, అధికారులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

చిత్రం చెప్పిన సమస్య



కడప నగరం ఉక్కాయపల్లె వద్ద పైపులు పగిలిపోవడంతో మురుగు నీరు ఇలా రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్గంధం వెదజల్లుతుండటంతో ఆ దారిన రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. పట్టించుకోండి సారూ.. అంటూ అధికారులకు విన్నవిస్తున్నారు. -స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప (ఆంధ్రజ్యోతి)

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :వివిధ ప్రభుత్వ శాఖల్లో శానిటేషన్, సెక్యూరిటీలో విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం వారు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి

వీరపునాయునిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి అని ఎంపీపీ రఘునాథరెడ్డి, మహమ్మద్ తాహ అన్నారు. అయితే సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. శుక్రవారం ఏపీహెచ్ఎస్ సూపర్‌వైజర్ అంబటి పద్మావతమ్మ పదవీ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బంది శాలువ, పూలమాలలతో ఆమెను సత్కరించారు. ఆమె సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రంగనాథ్, వైద్యసిబ్బంది రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అగ్రహారం ముక్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

సింహాద్రిపురం, నవంబరు 29: కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం అగ్రహారం ముక్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుంచి ముక్తేశ్వరస్వామికి రుద్రాభిషేకం, భస్మ అర్చన, రుద్రహోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరి

కడప, ఎడ్యుకేషన్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కడప రైల్వేస్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతాప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ అధికారులు మనోజ్, శ్రవణ్‌కుమార్, వీరయ్య, అభిరాం, కడప అధికారులు పాల్గొన్నారు.


కాలం చెల్లిన బస్సులతో వేగేదెలా..?

- గమ్యం చేరుతామనే గ్యారెంటీ లేని ఆర్టీసీ బస్సు ప్రయాణం..
- మరమ్మతులకు గురవుతున్న బస్సులతో ప్రయాణికుల అగచాట్లు



ఓబుళనాయునిపల్లె వద్ద మరమ్మతులకు గురైన బస్సు, మరో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

చక్రాయపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):రాయచోటి డిపోకు చెందిన బస్సులు గమ్యం చేరుస్తాయనే నమ్మకం లేకుండా పోయిందని ప్రయాణికులు తెలిపారు. చాలా వరకు డొక్కు బస్సులను తిప్పు తుండటంతో అవి మరమ్మతులకు గురవుతున్నాయని, దీంతో తమకు అవస్థలు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రోడ్డు కూడా అధ్వానంగా ఉండడంతో మరింత ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాయచోటి-వేంపల్లె బస్సు ప్రయాణం చేయాలంటే చాలా కష్టంగా ఉందన్నారు. బస్సులు ఎక్కడపడితే అక్కడ నిలబడి పోతున్నాయని, దీంతో ప్రయాణం అంటేనే విసుగేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా ఓ బస్సు నాగులగుట్టపల్లె వద్ద మొరాయించడంతో ఆ బస్సు డ్రైవర్ ప్రయాణికులచే తోయించారు. మరో బస్సు గేర్‌బాక్సు మరమ్మతులకు గురై ఓబుళనాయునిపల్లె వద్ద నిలిచిపోయింది. ఇలా కాలం చెల్లిన బస్సులతో ప్రయాణం భారంగా మారిందని ప్రయాణికులు పేర్కొన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి, ఉన్నతాధికారులకు పలుమార్లు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పలువురు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో మంచి బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వన భోజనాన్ని విజయవంతం చేయండి

కడప కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబర్ 1న శివప్రియ కల్యాణ మండపంలో నిర్వమించనున్న సామూహిక హిందూ ఐక్య కార్తీక వన భోజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళీశర్మ, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలో గల సాయిబాబా ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'గడప లోపల మన కులం, గడప దాటితే బంధువులం' అనే నినాదంతో కడప నగరంలోని అన్ని హిందూ ధార్మిక సంఘాల సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ హిందూధర్మ ప్రచారక్ రాధామనోహర్ దాస్, శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామిజీ, పల్లవోలు స్వామి మారుతిస్వామి హాజరై భక్తులకు దివ్య సందేశం ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. మధ్యాహ్నం 1 గంటకు సామూహిక కార్తీక అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు కార్తీక వన భోజనం

సికెదిన్నె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బలిజసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నగినాల శ్రీనివాసులు, కార్యదర్శి మాదరాసు రెడ్డియ్య తెలిపారు. కొత్తపేట గంగమ్మగుడి ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు బలిజ కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక వనభోజనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

'ఇళ్లను కూల్చిన వారిపై కేసులు నమోదు చేయాలి'

కడప(వినాయకనగర్),నవంబరు29(ఆంధ్రజ్యోతి): బద్వేలులో దళితుల ఇళ్లను కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శులు మునెయ్య, శంకర్‌నాయక్, బ్రహ్మం డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితులకు న్యాయం చేయాలన్నారు. న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

ధర్నాను విజయవంతం చేయండి

వేముల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.చాంద్‌బాషా పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ప్రజలను చైతన్యవంతులను చేయాలి



సర్వేను తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారిణి మనోరమ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని నగరిగుట్ట, జయమ్మకాలనీలలో పర్యటించారు. సిబ్బంది చేస్తున్న ఫీవర్ సర్వే, లార్వా సర్వేను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ రక్తపరీక్షలు చేయాలన్నారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించాలన్నారు. ప్రతి ఇంటిని తిరిగి నీటి నిల్వల్లో దోమ లార్వాను గుర్తించాలన్నారు. దోమల వలన మలేరియా, డెంగ్యూ, బోదకాలు, మెదడువాపులాంటి ప్రాణాంత వ్యాధులు ప్రబలుతాయన్నారు. కావున దోమలు పుట్టకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఎపీహెచ్ఈఓ శంకర్‌రెడ్డి, ఆరోగ్య ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కమలాపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాలలో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల మేథోశక్తిని పెంపొందించేందుకు ఇలాంటి ప్రోగ్రామం జరపడం అభినందనీయమన్నారు. ఇక్కడ విజేతగా నిలిచిన వారు డిసెంబరు నెలలో జిల్లా క్విజ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మండల విజేతలకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ మండల కన్వీనరు పాఠశాల ఉపాధ్యాయులు సాయికుమార్, జనార్ధన్‌రెడ్డి, సుబ్బరాజు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

పెండ్లిమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం విద్యాశాఖాధికారి గంగాధర్‌నాయక్ బహుమతులు అందించారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన జడ్పీ హైస్కూల్‌లో వివిధ పాఠశాలలు చెందిన ఎనిమిది విద్యార్థి బృందాలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటిస్థానంలో ఇసుకపల్లె పాఠశాల, రెండవ స్థానంలో నందిమండలం విద్యార్థుల బృందం నిలిచాయి. మొదటిస్థానంలో నిలిచిన బృందం జిల్లాస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, గౌస్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

- రూ.54070 ఆదాయం



వాహనాల వేలం నిర్వహిస్తున్న అధికారులు

పులివెందుల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేయడం ద్వారా రూ.54070 ఆదాయం వచ్చిందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎం.రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మూడు ద్విచక్ర వాహనాలను వేలం వేశామన్నారు. వీటి విలువ రూ.37000 కాగా 54,070 ఆదాయం వచ్చిందని, దీనికి 18 శాతం జీఎస్టీ వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

లింగాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల్లో జూదం ఆడుతున్న ఆరుగురిపై పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మధుసూదన్‌రావు మాట్లాడుతూ మండలంలోని ఇప్పట్ల గ్రామ పొలాల్లో జూదం ఆడుతుండగా అందిన సమాచారం మేరకు వారిపై దాడి చేసి రూ. 201200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారు తొండూరు, సింహాద్రిపురం పులివెందుల మండలాలకు చెందిన వారని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

సింహాద్రిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని హిమకుంట్ల ఎస్సీ కాలనీకి అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో ఆ కాలనీ అంధకారంలో చిక్కుకుంది. ఎస్సీకాలనీ వాసులు సుమారు రూ.3 లక్షల మేర బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని విద్యుత్ అధికారులు తెలిపారు.

గండిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి

చక్రాయపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం గండిలో షాపుల యజమానులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరికాయలు, పూలు విక్రయించేవారు, ఇతర షాపుల వారు ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. దాని స్థానంలో ఆకులు గాని, బుట్టలు గాని, బ్యాగులు గాని ఉపయోగించాలని సూచించారు. నిబంధనలు పాటించాలని, పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రూ.5వేలు జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. హోటల్ వారు అరటి ఆకులు, పేపర్ ప్లేట్లు వాడాలన్నారు.

మినుము పంటకు తెగులు.. రైతుకు దిగులు



అయ్యవారిపల్లె వద్ద పండుబారుతున్న మినుము పైరు

వేంపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు ఏదో ఒక విధంగా నష్టం జరుగుతూనే ఉంది. వ్యయప్రయాసలకోర్చి పంట సాగుచేస్తే చేతికి వస్తుందో రాదోనన్న ఆందోళన ఎప్పుడూ వెంటాడుతోంది. మండలంలో సాగుచేసిన మినుము రైతు పరిస్థితి దయనీయంగా మారింది. పంటకు తెగులు సోకడంతో ఆకు పండుబారడంతో దిగుబడి వస్తుందో రాదో అన్న ఆందోళన నెలకొంది. మండల వ్యాప్తంగా కత్తలూరు, నాగూరు, పాములూరు, అయ్యవారిపల్లె, అలవలపాడు, ముతుకూరు, రామిరెడ్డిపల్లె తదతర గ్రామాల్లో సుమారు 1500 నుంచి 2000 ఎకరాల్లో మినుము పంట సాగుచేశారు. సెప్టెంబరు 15 నుంచి పంట సాగుచేశారు. కొద్దిరోజులుగా పంట ఉన్నట్లుండి పండుబారుతోంది. ఎకరాకు రూ.25వేల దాకా వెచ్చించి సాగుచేసిన పంటకు ప్రస్తుతం మందులు కొడుతున్నప్పటికి పండుబారుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక విపత్తు వచ్చి పంటకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి కనీసం రెండు మూడు క్వింటాలు వస్తుందో రాదో అని దిగులుపడుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారులు చర్యలు తీసుకొని తగు మందులు సూచించాలి, నష్టపోయిన రైతును ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

మూడెకరాల్లో సాగుచేశాం

మూడు ఎకరాల్లో పంట సాగుచేశా. 60 రోజులకు పైగా కావస్తోంది. ఉన్నట్లుండి పంట పండుబారుతోంది. తెగులుతో నష్టపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి. - ఉత్తమారెడ్డి, అయ్యవారిపల్లె

ఉన్నట్లుండి పండుబారుతోంది

పైరు కొద్దిరోజులుగా పండుబారుతోంది. పది ఎకరాల్లో సాగుచేశా. సుమారు రూ.2 లక్షలకు పైగా ఖర్చు అయింది. పంట ఇదేమాదిరి ఉంటే నష్టపోవడం ఖాయం. రైతులను ఆదుకోవాలి.
- వీరభైరవరెడ్డి, రైతు, కత్తలూరు, వేంపల్లె

ఏఓ ఏమన్నారంటే...

ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల పైరు రంగు మారుతోంది. తగిన మందులు వాడితే ఉపయోగం ఉంటుంది. - రాజేంద్రప్రసాద్, ఏఓ

అలంకారప్రాయం..!



అమృతానగర్‌లో ఏడాదిగా శుభ్రం చేయని వాటర్ ట్యాంకు

• నిర్లక్ష్యపు నీడలో నీటిట్యాంకులు • పల్లెసీమల్లో తాగునీటి వెతలు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రక్షిత మంచినీటిని సరఫరా చేసే పథకాల నిర్వహణ సజావుగా సాగడంలేదు. పలు గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతిరోజు బ్లీచింగ్‌పౌడర్ కలపడం, 15 రోజులకు ఒకసారి ట్యాంకును శుభ్రం చేయాల్సి ఉన్నా నెలల తరబడి పట్టించుకోకపోవడంతో ప్రజల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారు. నిత్యం వేలాది మందికి మంచినీరు సరఫరా చేసే ట్యాంకుల నిర్వహణలో పంచాయతీలు అప్రమత్తంగా మెలగాల్సి ఉన్నా మెతకవైఖరితో లక్ష్యం నెరవేరడంలేదు. నీటి ట్యాంకుల్లో నీరు తాగేందుకు పనికిరాకుండాపోయింది. చాలా ప్రాంతాల్లో ట్యాంకుల్లో నీటిని నింపడంలేదు. దీంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించినా నిర్వహణ కొరవడి నిరుపయోగంగా మి



ముళ్లపొదల మధ్య మూలవారిపల్లె నీటి ట్యాంకు

గిలాయి.

• మొక్కుబడిగానే... ప్రొద్దుటూరు మండల పరిధిలో 15 పంచాయతీల్లో 25 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 34,908 కుటుంబాలు ఉన్నాయి. మండల పరిధిలో మొత్తం 36 మంచినీటి ట్యాంకుల నిర్మాణాలు ఉన్నాయి. గ్రామాల్లోని ట్యాంకుల నిర్వహణ మొక్కుబడిగానే సాగుతోంది. ప్రమాణాలకు అనుగుణంగా పనులు జరగడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు వీటి నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించాల్సి ఉంది. ప్రతిరోజు క్లోరినేషన్‌తోపాటు 15 రోజులకు ఒకసారి ట్యాంకును శుభ్రం చేసి మళ్లీ ఎప్పుడు శుభ్రం చేసేది వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం నిర్దేశించినా క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి కనిపించడంలేదు.

• కలుషిత నీటితో అనర్థాలు..: నెలకు ఒకసారి అయినా ట్యాంకులను శుభ్రం చేయకపోతే తాగునీరు కలుషితం అవుతోంది. అలాంటి నీటిని తాగితే అతిసార, డయేరియా తదితర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. చాలా ప్రాంతాల్లో క్లోరినేషన్, ట్యాంకులు శుభ్రపరచకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి.

• మోటార్లతో నేరుగా సరఫరా..: మంచినీటి ట్యాంకుల నిర్వహణ గాలికొదిలేశారు. పల్లెసీమకు శుద్ధి నీరు కలగా మారింది. మండలంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో బోర్లను వేసి మోటార్ల ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ల ద్వారా నేరుగా నీటి సరఫరా జరుగుతోంది. పైపులైను లీకేజీ సమస్యలు ఏర్పడినప్పుడు తాగునీరు కలుషితమవుతోంది. మండలంలో సరఫరా అవుతున్న ఈ తరహా నీటిలో జవుకులు వస్తున్నాయని గ్రామీణులు వాపోతున్నారు. తాళ్లమాపురం పంచాయతీలో తాళ్లమాపురం, మూలవారిపల్లె, సగిలిగుడ్డుపల్లె ప్రాంతాల్లో నీటి సరఫరా కోసం ఎనిమిది మోటార్లను ఏర్పాటు చేయగా వాటిలో నాలుగు జవుకులు, ఉప్పునీరు ఉండడంతో ప్రస్తుతం వినియోగించడంలేదు. ఊరికి దక్షిణ భాగంలో ఉన్న మూడు మోటార్ల నుంచి నీటిసరఫరా జరుగుతోంది. మేజర్ పంచాయతీ అయిన కొత్తపల్లెలోకూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్నా ట్యాంకుల నిర్వహణలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. పంచాయతీ పరిధిలోని పాత అమృతానగర్‌లో ఏడాది దాటినా ట్యాంకును శుభ్రం చేయలేదని స్థానికులు వివరించారు. మండల పరిధిలో ఉన్న 36 నీటి ట్యాంకుల్లో ఇలాంటి సమస్యలే వెంటాడుతున్నాయి. సరఫరా అవుతున్న నీరు వాడకానికి మాత్రమే ఉపయోగపడుతున్నది. కరెంటుపోతే ఆపాటి సరఫరా కూడా నిలిచిపోతుంది. మంచినీటి సరఫరాలో ఉన్న లోపాలతో మండల ప్రజలు ఎక్కువ శాతం శుద్ధినీళ్లకు అలవాటు పడ్డారు. చేసేది లేక డబ్బులు వెచ్చించి మరీ మంచినీటిని వినియోగిస్తున్నారు. దీంతో గ్రామ గ్రామాన వాటర్ ప్లాంట్లు వెలిశాయి.

పంచాయతీలదే బాధ్యత

ట్యాంకుల నిర్మాణం పూర్తయిన తర్వాత పంచాయతీలకు అప్పగిస్తాం. మంచినీటి ట్యాంకుల నిర్వహణ పూర్తిగా ఆయా పంచాయతీలదే బాధ్యత. నిత్యం క్లోరినేషన్ 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయడం, మోటార్లు నడపడం, లీకేజీలు, మరమ్మతులు తదితరవి పంచాయతీల విధి. ప్రత్యేకంగా వీటికోసం మనుషులను కేటాయించి పనులు చేయించుకోవాలి.

భరత్‌కుమార్‌రెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

పెన్నానది బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



జమ్మలమడుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-మైలవరం పెన్నానదిలో రోడ్డు మూడు నెలల క్రితం వరద నీటి ప్రవాహంతో కోతకు గురైంది. అప్పటి నుంచి ఆ ప్రాంతానికి వెళ్లే అధికారులు, ప్రజలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీరు మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి విడుదల చేసినప్పుడు అధికారులు పెన్నానదిలో వెళ్లరాదని అప్రమత్తం చేసి జమ్మలమడుగు, వేపరాల వద్ద పెన్నానదిలోకి వెళ్లకుండా మట్టి కట్టలు అడ్డువేశారు. ప్రస్తుతం పెన్నానదిలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. పెన్నానదిలో నీరు లేకపోవడం వలన ఇసుక ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు వెళుతున్నాయి. అయితే ఆ దారిలో ప్రతి సోమవారం గురప్పస్వామి, పీర్‌గైబూసాకొండ ప్రాంతాలకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. జమ్మలమడుగు, మోరగుడి, దొమ్మరనంద్యాల మీదుగా సుమారు అయిదు నుంచి 6 కిలోమీటర్లు ఎక్కువగా ఉన్నందున చుట్టూ తిరిగి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పెన్నానదిలోని రోడ్డుకు మరమ్మతులు చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



జాబ్‌మేళాకు విశేష స్పందన

జమ్మలమడుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని అంబవరం సమీపాన ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించినట్లు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతు ప్రతినెలా ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. మొత్తం 75 మంది విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకాగా అందులో 38 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పోరుమామిళ్ల..: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మేళాలో 41 మంది పాల్గొనగా 31 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్, పీరయ్య, ఎంబడి ఈశ్వరయ్య, స్కిల్ సెంటరు శిక్షకులు మోహన్, సుహాసిని, నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటరు వెంకట్రావు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి

పోరుమామిళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రబీపంటల బీమా 2024-25 ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు జిల్లాలో 8 రకాలుకు సంబంధించి వ్యవసాయ పంటలు ఆబీమా కోసం ఎంపిక చేసినట్లు ఏవో వరహరి కుమార్ తెలిపారు. ఎకరా వరికి రూ.630, శనగ, వేరుశనగకు రూ.480, జొన్నలకు 315, ప్రొద్దుతిరుగుడుకు రూ.300, మినుములు 285, పెసలకు రూ.270, నువ్వులకు రూ.180 చొప్పునప్రీమియం చెల్లించాలన్నారు. వరి పంటకు డిసెంబరు 31లోపు మిగతా పంటలకు 15లోపు రైతులు ప్రీమియం చెల్లించా లన్నారు.

ఆస్పత్రి తనిఖీ

చాపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి రవిబాబు శుక్రవారం తనిఖీలో చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజు ఎంతమంది రోగులు వైద్యం కోసం ఆస్పత్రికి వస్తున్నారని డాక్టర్ రాజేష్‌కుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే తప్పనిసరిగా చేయాలన్నారు. చిన్నపిల్లల వ్యాధి నిరోధక టీకాలు కూలింగ్‌లో తప్పకుండా ఉంచాలని ఆయన సలహా ఇచ్చారు. ఏఎన్‌ఎంలు గ్రామాలకు వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ఘనంగా సుందరేశ్వరస్వామికి అన్నాభిషేకం, పూజలు

జమ్మలమడుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థంలో బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం భక్తులు, అర్చకులు పూజలు చేసి మొక్కుకున్నారు. శైవక్షేత్రమైన కన్యతీర్థంలో కార్తీకమాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి 50 కిలోల బియ్యంతో అన్నం తయారు చేసి అభిషేకం చేశారు. సమస్త జీవరాశులకు అన్నపానాదులకు లోటు లేకుండా ఉండడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అర్చకుడు హరిహరనాథశర్మ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కమిటీవారు భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు.

సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

బద్వేలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల నరసింహారెడ్డి, సబ్ జైలు సూపరింటెండెంట్ శ్రీహరిలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుగంగ కాలనీలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతిగృహంలోని అనాథవృద్ధులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి దేవాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించండి : ఎంపీడీవో

మైలవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ సావిత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మహాలక్ష్మీ, ఎంఈఓ చిట్టిబాబు, ఏపీఎం శ్రీహరి, ఏఈ చిదంబర్‌రెడ్డి, ఉపాధిహామీ ఏపీవో ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి'

బద్వేలు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐలమ్మ కాలనీలో ఎస్సీల ఇళ్లు కూల్చినవారిపై కేసు నమోదు చేసి అరెస్టుచేయాలని దళిత హక్కు పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఇమ్మానుయేల్, వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం బల్లి ఓబయ్య, దొడ్డగాల గంగయ్య 16 సంవత్సరాలుగా నివాసం ఉంటూ మున్సిపాలిటీ కి పన్ను కడుతున్నప్పటికీ సయ్యద్ గుల్‌ఫర్, షేక్ జాఫర్, షేక్ నాయబ్ ఇక్కడ తమకు పట్టాలున్నాయని ఖాళీ చేయమనేవారన్నారు. ఈ నెల 22వ తేదీన ఆయా గృహాల యజమానులు ఇంట్లో లేని సమయంలో ఎక్స్‌కవేటర్‌తో కొంతమంది వచ్చి ఇంటిని కూల్చివేసినట్లు బాధితులు తెలిపారన్నారు. వారిపై కేసులు నమోదయ్యాయని ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ప్రొద్దుటూరు, నవం బరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వాలు కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం రాజ్యాంగ చైతన్య యాత్ర ప్రొద్దుటూరుకు వచ్చిన సందర్భంగా పాతబస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేసి తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. బాలలక్షుమయ్య, నాగభూషణంమాదిగ, శివరాం, నరసింహులు సుబ్బలక్షుమ్మ పాల్గొన్నారు.

దోమలు నిర్మూలనకు ఫాగింగ్

ప్రొద్దుటూరు ,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని పలు వార్డుల్లో దోమల నిర్మూలన కోసం పబ్లిక్ హెల్త్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారంస్థానిక రెండో వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా ఆధ్వర్యంలో ఫాగింగ్ చేపట్టారు. అలాగే కాలువల్లో దోమలను నిర్మూలించడానికి స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు.

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం



ఎర్రగుంట్ల, నవంబరు 29: ఎర్రగుంట్ల-కడపరోడ్డులోని హరిహరపుత్ర ఆలయం నుంచి అయ్యప్పస్వామి గ్రామో త్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని అత్యంత శోభాయమానంగా అలంకరించారు. కేరళవాయిద్యాలతో అయ్యప్ప గ్రామోత్సవం సాగింది. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి





ఖాజీపేట... మురుగు కుంటను పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది, బీకోడూరు... ఐత్రంపేట గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి

ఖాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం ఖాజీపేట పంచాయతీలోని టీచర్స్ కాలనీలో డ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాల్లోని నీటి తొట్లు, నీటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పరిసర ప్రాంతాల్లో నీటిని నిలువలేకుండా చూసుకోవడంతోపాటు కూలర్స్, టైర్లు, టెంకాయ బోండాలు లాంటివాటిలో లార్వా ఎక్కువగా ఉంటుందన్నారు. రాత్రివేళల్లో దోమల నివారణకోసం దోమతెరలు వినియోగించుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేసు, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, వైద్య సిబ్బంది, విస్తరణాధికారి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండలంలోని ప్రజలు సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వినీత్‌కుమార్ రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఐత్రంపేట గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో డ్రైడే డ్రైడే కార్యక్రమం సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం మల్లిక, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఉత్తీర్ణతే లక్ష్యం

గురుప్రసాద్, ఏఎస్‌డబ్ల్యూఓ



ముఖాముఖి

ప్రొద్దుటూరు అర్బన్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మా హాస్టల్‌లో చదివే విద్యార్థులకు పూర్తిస్థాయి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నామని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గురుప్రసాద్ తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మా విద్యార్థులు ర్యాంకులు సాధిస్తున్నా రని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధివిధానాలు పాటిస్తూ హాస్టళ్ల అభివృద్ధికి పాటు పడతాం అంటున్న ఏఎస్‌డబ్ల్యూఓతో ఆంధ్రజ్యోతి...

ప్రశ్న: మీ పరిధిలో ఎన్ని హాస్టళ్లున్నాయి.

జవాబు: నా పరిధిలో మొత్తం 12 హాస్టళ్లు ఉన్నాయి. మూడో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు 8 హాస్టళ్లు ఉండగా అందులో అబ్బాయిలకు 5, అమ్మాయిలకు 3 హాస్టళ్లు ఉన్నాయి. ఆపై చదువులు చదివే వారి కోసం 4 హాస్టళ్లు ఉన్నాయి. అందులో అబ్బాయిలకు 2, అమ్మాయిలకు 2 హాస్టళ్లు.

ప్రశ్న: మీ పరిధిలోని హాస్టళ్లలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.

జవాబు: మొత్తం 1050 మంది.

ప్రశ్న: గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగిందా.. తగ్గిందా.

జవాబు: గత సంవత్సరం కన్నా ఈ విద్యా సంవత్సరం 25% విద్యార్థుల సంఖ్య పెరిగింది. గతంలో కన్నా హాస్టళ్లలో ఇప్పుడు మెరుగైన వసతుల ఏర్పాటుతో విద్యార్థుల సంఖ్య పెరగడానికి కారణం అయింది.

ప్రశ్న: హాస్టళ్ల అభివృద్ధికి ఎన్ని నిధులు మంజురు అయ్యాయి.

జవాబు: నా పరిధిలోని హాస్టళ్ల అభివృద్ధికి కలెక్టర్ విజయరామరాజు హయాంలో డి ఎంఎఫ్ నిధుల ద్వారా రూ. 1.70 కోట్లు మంజూరు చేశారు.

ప్రశ్న: గత ప్రభుత్వ హయంలోని మెనూ అమలు చేస్తున్నారా లేదా ఏమైనా మార్చారా.

జవాబు: ప్రస్తుతానికి గత ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారమే విద్యార్థులకు అమలు చేస్తున్నాం.

ప్రశ్న: పదో తరగతి విద్యార్థులు ఎంత మంది ఉన్నారు. వారికి స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నారా.

జవాబు: 8 హాస్టళ్లలో 69 మంది పదో తరగతి చదివే విద్యార్థులు ఉన్నారు. వారికి ఉదయం 6 నుంచి 8వరకు, సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: విద్యార్థులలో మనోధైర్యం నింపేందుకు ఏమైనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా.

జవాబు: మోటివేషనల్ స్పీకర్స్, సైకాలజిస్ట్ నిపుణులతో కార్యక్రమాలు నిర్వహించి పరీక్షలు అంటే భయపడే విద్యార్థులలో మనోధైర్యం నింపుతున్నాం.

ప్రశ్న: హాస్టళ్ల పనితీరు పర్యవేక్షిస్తున్నారా.

జవాబు: హాస్టళ్ల పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాడానికి 92 మంది వెల్ఫర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఉన్నారు. వారు పర్యవేక్షించి నా దృష్టికి రిపోర్టు పంపిస్తారు.

నేడు పింఛన్ల పంపిణీ

మైలవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమం శనివారం ప్రారంభమవుతుందని ఎంపీడీవో రామచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో నవంబరు 30నే పింఛన్లు అందజేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. మండలంలో 6492 మందికి గాను రూ.2కోట్ల62 లక్షల68వేలను పింఛను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

కొండాపురం..: ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లను శనివారం తెల్లవారు జామున 5.30 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. 1 వతేది ఆదివారం కాబట్టి ఒకరోజు ముందుగానే అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 6232 పింఛన్లు ఉండగా ఈ నెల వివిధ కారణాల రీత్యా 4 తొలగించామన్నారు. ఒకవేళ ఈ నెల తీసుకోకపోతే మూడు నెలల్లో ఎప్పుడైనా పింఛన్ తీసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఎంపీడీవో తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్లపై నిద్రించే నిరాశ్రయులకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు రోడ్లు, గుడుల వద్ద, బస్టాండులో నిద్రిస్తున్నవారికి దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాత్రి 12 గంటల నుంచి 3 గంటల వరకు నిరాశ్రయులకు చలి నుంచి కాపాడుకోవడానికి దుప్పట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వెంకటసురేష్, శ్రీనాథ్, నరసింహ, విజయ్, రాజేష్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

